## క్లుప్తంగా

### నేడు మంత్రి పర్యటన

**రాయచోటి టౌన్ :** నేడు అన్నమయ్య జిల్లాలో పలు కార్యక్రమాలలో రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొననున్నారని సమాచార శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం చిన్న మండెం మండలం బోడిరెడ్డిగారిపల్లెలోని తన స్వగృహంలో ప్రజాదర్బార్‌లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం సంబేపల్లె మండలం పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం రాయచోటిలోని డైట్ కళాశాల ఆవరణలో జరిగే సైన్స్ ఫెయిర్‌ను సందర్శించనున్నట్లు తెలియజేశారు.

### క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**సంబేపల్లె :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రుక్సానా, అఫ్రా, మౌనిక, నిఖిల్, ఫాజిల్‌లు ప్రతిభ కనబరచడంతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మయ్య, పాఠశాల కో–ఆర్డినేటర్ రెడ్డిశేఖర్, రామయ్యలు పాల్గొన్నారు.

### సోషల్ మీడియా కన్వీనర్‌కు పరామర్శ



హరినాథ్‌తో మాట్లాడుతున్న కొరముట్ల

**రైల్వేకోడూరు అర్బన్ :** అనారోగ్యంతో గత వారం రోజులుగా వేలూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సోషల్ మీడియా కన్వీనర్ పంటా హరినాథ్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీకర్, ఎస్.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందన

**చిట్వేలి :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి పులి దిలీప్‌కుమార్ ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కేరళలో జరిగిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ యాత్రలో పాల్గొని వచ్చిన సందర్భంగా సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో అభినందన సభ జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్‌లు అభినందించి ధృవ పత్రాన్ని, పతకాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు దుర్గరాజు, విశ్వనాథం, విద్యార్థులు దిలీప్ కుమార్‌ను అభినందించారు.

### అన్నదానం

**నందలూరు :** అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద గోపినేని కొండయ్య యాదవ్ 71వ జయంతి సందర్భంగా ఆయన కుమారులు హిమగిరి నాథ్ యాదవ్, కృష్ణ సుమంత్ యాదవ్‌లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎస్ఐ రామ్మోహన్, కుర్ర మణియాదవ్, వేణు, జుల్ఫికర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### జనవరి 1న లక్ష్మీనృసింహుడి కల్యాణం

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని ఓబులేశ్వర గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నూతన సంవత్సరం సందర్భంగా పురస్కరించుకుని జరుపనున్నట్లు నిర్వాహకులు వేంపల్లి చైతన్య, స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డిలు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవంలో పాల్గొనే భక్తులకు రాస్ అగ్రిఫామ్స్ అధినేత పెద్దిరెడ్డి రఘురామిరెడ్డి, బి.ఎర్రగుడి కాపుపల్లికి చెందిన ఓబుల్ సుబ్బారెడ్డి, నేర్సుపల్లి సునీల్ కుమార్ రెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. భక్తులను అలరింపచేయడానికి కోలాటం, చెక్కభజన, హరికథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు.

### 2 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

**రాజంపేట టౌన్ :** వచ్చే ఏడాది జనవరి 2వ తేదీ నుంచి ఎనిమిది రోజులపాటు పట్టణంలోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలు ఉంటాయని అద్వైత సత్సంగ రాజంపేటశాఖ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జగద్గురు మఠం లలితాంబిక పీఠాధిపతులు, శ్రీకాళహస్తికి చెందిన శుఖ బ్రహ్మ ఆశ్రమ ఉత్తర పీఠాధిపతులు సంపూర్ణానందగిరి స్వామివార్లచే ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6:30 గంటల నుంచి 8 గంటల వరకు ముండకోపనిషత్తు, సాయంత్రం 6:30 గంటల నుంచి 8 గంటల వరకు భగవద్గీత 13వ అధ్యాయం క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగంపై ఆధ్యాత్మికోపన్యాసాలు ఉంటాయని చెప్పారు.

### అర్జీలను పరిష్కరించండి

**పుల్లంపేట :** రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు వీఆర్‌ఓలు కృషి చేయాలని తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. సోమవారం ఆయన వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతి వీఆర్‌ఓ గ్రామాలలో ప్రజలకు అవసరమయ్యే ఆన్‌లైన్‌కు సంబంధించి క్యాస్ట్, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

# హడలెత్తిస్తున్న వీధికుక్కలు

- జిల్లా కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న కుక్కకాటు కేసులు
- వ్యాక్సిన్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు
- శునకాల బెడద తప్పించాలంటున్న మున్సిపల్ వాసులు



రాయచోటి మున్సిపాలిటీలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలు

**రాయచోటి (జగదాంబసెంటర్) :** వీధి కుక్కలతో రాయచోటి మున్సిపాలిటీ ప్రజలు హడలెత్తిపోతున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ప్రజలు ఈ కుక్కల గుంపును చూసి భయభ్రాంతులకు లోనవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే పిచ్చికుక్కల బెడద ఎక్కువ. దీంతో వర్షం పడితే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదంటూ విమర్శలు గుపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అయితే వీధికుక్కలు ద్విచక్రవాహనం వెంట పరుగులు తీస్తుండటంతో కొన్నిచోట్ల వాహన చోదకులు అదుపుతప్పి గాయపడిన సంఘటనలు కోకొల్లలు. నోటి వెంట లాలాజలంతో పిచ్చికుక్కలు సంచరిస్తుండటంతో పలు వార్డులలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పట్టణంలోని మాసాపేట, పాత రాయచోటి, జగదాంబ సెంటర్, కొత్తపేట, ఎస్ఎన్ కాలనీ, కొత్తపల్లి, రాయుడు కాలనీ, మదనపల్లె రోడ్డు తదితర ప్రాంతాలలో వీధికుక్కలు అత్యధికంగా ఉన్నాయి.

రాత్రి సమయంలో రాకపోకలు సాగిస్తున్న వారిపై అధికంగా దాడులకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నానాటికి కుక్కకాటు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. కుక్కకాటుకు గురైనవారు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్న అవగాహన లేక కొందరు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

#### కుక్కల బెడదను నివారించాలి



మున్సిపాలిటీలో కుక్కల బెడద రోజురోజుకూ అధికమవుతోంది. చిన్నపిల్లలను కరిచేందుకు ప్రయత్నించడమే కాకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇటీవల మా వార్డు పరిధిలో కుక్కదాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాత్రిపూట ద్విచక్రవాహనాలపై వెళుతుంటే కుక్కలు వెంబడిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– సుగుణవేణి, బోస్‌నగర్, రాయచోటి

#### పిల్లలను బయటకు పంపలేకున్నాం



వీధికుక్కలు అన్ని వార్డుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపాలంటే భయమేస్తోంది. ఒక్కసారిగా కుక్కల గుంపు వచ్చి దాడి చేస్తుండటంతో పిల్లలను బయటకు పంపాలంటే జంకుతున్నాం. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి పరిష్కార మార్గం చూపాలి. లేకుంటే చిన్నారులు కుక్కకాటుకు గురికాక తప్పదు.

– మోహన్‌కుమార్, పాతరాయచోటి, రాయచోటి మున్సిపాలిటీ

#### వ్యాక్సిన్ అందుబాటులో ఉంది



వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. కుక్క కరిస్తే ప్రభుత్వ వైద్యశాలలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఏదైనా కుక్క కరిస్తే అది మంచిదా.. పిచ్చి కుక్కనా అని నిర్ధారణ చేసుకోవాలి. పిచ్చి కుక్క అయితే తప్పనిసరిగా నాలుగు డోసుల ఇంజెక్షన్ వేయించుకోవాలి. చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్త అవసరం.

– డేవిడ్ సుకుమార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, రాయచోటి

### నేడు డీలర్ల నియామకానికి ఇంటర్వ్యూ

**సుండుపల్లె :** డీలర్ల నియామకం కోసం రాత పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణులైన వారు ఈనెల 31వ తేదీ మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తహసీల్దార్ దైవాదీనం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలియజేశారు.

### రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలి

**రైల్వేకోడూరు అర్బన్ :** ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు మానవాళి ఆరోగ్యానికి శ్రేయస్కరమని సోమవారం ఏఓ సుధాకర్, ఏపీఎం వసుంధరలు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయ విధానాన్ని అనుసరించడానికి రైతులు ముందుకు రావాలని తెలిపారు. క్రిమి సంహారక మందులు ఉపయోగించకుండా కేవలం జీవామృతం, సేంద్రియ ఎరువులు వాడి పండించే పంటలకు భవిష్యత్‌లో డిమాండ్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు ప్రోత్సహించం.. ప్రత్యామ్నాయం చూపిస్తాం



బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

**గాలివీడు :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశానుసారం ఆర్‌అండ్‌బీలో నివాసాలు కోల్పోయిన బాధితులతో సోమవారం అధికారులు చర్చలు జరిపారు. పట్టణంలోని గేటు నాలుగురోడ్ల కూడలి సర్వే నెంబర్ 2266 ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు తొలగింపులో నివాసాలు కోల్పోయిన బాధితులు ఇటీవల గాలివీడు పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎంను కలిసి న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆయన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సోమవారం గాలివీడులోని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసులు బాధితులతో చర్చలు జరిపారు. ఆక్రమణలు తొలగించాల్సి వస్తే 1.80 ఎకరాల్లో ఉన్న మొత్తం స్థలాన్ని ఖాళీ చేయించాలని, అలా కాకుండా నిరుపేదలమైన తమ నివాసాలు మాత్రమే తొలగించడం అన్యాయం అంటూ బాధితులు ఆర్డీఓ ముందు వాపోయారు. ఈ విషయంపై ఆర్డీఓ స్పందిస్తూ ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు ప్రోత్సహించలేమని, అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు ప్రత్యామ్నాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వారి హామీ ఇచ్చారు.

## హద్దు మీరితే చర్యలు తప్పవు



పి.మహేష్, ఎస్ఐ

**ఓబులవారిపల్లె :** నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ రాత్రి యువకులు ఎక్కడైనా హద్దు మీరి ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ మహేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త సంవత్సరం వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. రాత్రి 12 తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని నడిపిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**సుండుపల్లెలో..**



ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు

**సుండుపల్లె :** నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీ ఇతరులకు ఇబ్బంది కల్గిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఒక ప్రకటనలో ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం, లైసెన్సు లేకుండా అధిక డీజేలు ఏర్పాటు చేయడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, హారన్ అదే పనిగా మోగించడం, వాహనాలపై విన్యాసాలు చేయడం వంటి కార్యక్రమాల చేయకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

**ఒంటిమిట్ట :** జనవరి 4, 5వ తేదీలలో కడప నగరంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సీపీఎం) వైఎస్సార్ జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, ఒంటిమిట్ట మండల కార్యదర్శి నరసయ్యలు కోరారు. సోమవారం ఉదయం జిల్లా మహాసభల కరపత్రాలను ఒంటిమిట్ట మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 4వ తేదీ కడప నగరంలో ఉదయం 10 గంటలకు జియోన్ కాలేజీ నుంచి ర్యాలీ ప్రదర్శన, అనంతరం ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. సభకు ముఖ్య అతిథిగా కర్నూల్ మాజీ శాసనసభ్యులు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రాము, హరి, వెంకటేష్, లక్ష్మీ నారాయణ, ఆములమ్మ, పార్వతి పాల్గొన్నారు.

## 'హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'



నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

**రాయచోటి అర్బన్ :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌పై అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బీజేపీ ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సీఐటీయూజిల్లా కార్యదర్శి రామాంజులు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నేత విశ్వనాథలు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దారుణమన్నారు. ఆయన వ్యాఖ్యలకు ప్రధాని నరేంద్ర మోడీ ఎలాంటి అభ్యంతరం తెల్పకపోవడం ప్రజాస్వామ్యం పట్ల బీజేపీ నేతలకు ఉన్న నిబద్ధత ఏపాటిదో అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం అమిత్‌షాను కేంద్ర మంత్రిగా తొలగించని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయనేత రామాంజులు, వామపక్ష పార్టీల నేతలు విశ్వనాథనాయక్, శ్రీనివాసులు, మండెం సుధీర్‌కుమార్, రంగారెడ్డి, రమణ, పెద్దన్నతో పాటు పలువురు పార్టీనేతలు పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడిగా మనోహర్ రెడ్డి

**పుల్లంపేట :** పుల్లంపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా కమలాపురం మనోహర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా తోట శ్రీనివాసులు వ్యవహరించారు. దీంతో మాజీ మండల అధ్యక్షుడు గడికోట రామకృష్ణయ్య మనోహర్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామ సుబ్బారెడ్డి, తంబాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**రాయచోటి అర్బన్ :** విద్యారంగ సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్వేపల్లె నరసింహ, డి.వి.రమణలు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28, 29 తేదీలలో మదనపల్లె పట్టణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ప్రథమ మహా సభల్లో విద్యారంగం సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాల కోసం కొన్ని తీర్మానాలను చేశారన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలంటూ కోరారు. రాయచోటి, కోడూరు, మదనపల్లెలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలను నెలకోల్పాలన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని, బీటీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి యూనివర్సిటీని చేయాలన్నారు. అలానే జీఓ నం.77, 117, 118 జీఓలను వెంటనే రద్దుచేయాలని, రేషనలైజేషన్ పేరుతో మూసివేసిన పాఠశాలలను యథావిధిగా తిరిగి పునఃప్రారంభించాలన్నారు.

**నూతన జిల్లా కమిటీ ఏర్పాటు**

మహాసభల సందర్భంగా జిల్లా ఎస్ఎఫ్ఐకు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సర్వేపల్లె నరసింహ, డి.వి.రమణ, ఉపాధ్యక్షులుగా మదన్‌మోహన్‌రెడ్డి, లతీఫ్‌లను ఎన్నుకున్నామన్నారు. సహాయ కార్యదర్శులుగా ఆఫ్రిది, గురునాథ్‌లు, జిల్లాకమిటీ సభ్యులుగా జయబాబు, గిరి, జస్వంత్, ప్రశాంత్,చందు, ఆదర్శ్, జీవన్ తదితరులను మదనపల్లె సమావేశాల్లో ఎన్నుకున్నట్లు సోమవారం ఇక్కడి విలేకరులకు వారు తెలియజేశారు.

## సేవలు విస్తృత పరిచేందుకు మరింత కృషి



డ్వాక్రా యానిమేటర్లకు లోన్ చెక్కును అందజేస్తున్న ఆర్ఎం మురళీ మోహన్

**సుండుపల్లె :** ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు విస్తృతపరిచేందుకు కెనరా బ్యాంకు సిబ్బంది మరింత కృషి చేయాలని కడప డివిజనల్ మేనేజర్ మురళీ మోహన్, బ్రాంచ్ మేనేజర్ మస్తాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీమోహన్ మాట్లాడుతూ మండల ప్రజల సహకారంతో కెనరా బ్యాంకు రూ.172 కోట్ల లావాదేవీలతో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఖాతాదారులు ప్రతి ఒక్కరూ డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు జీరో అకౌంట్, సేవింగ్స్ అకౌంట్లతోపాటు ఏంజెల్ అకౌంట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఖాతాదారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి డ్వాక్రా గ్రూపు యానిమేటర్ సుబ్బమ్మకు లోన్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాయచోటి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సిమ్మి, ఖాతాదారులు, వెలుగు ఆఫీస్ యానిమేటర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

**రాజంపేట :** బోయనపల్లెలో ఉన్న ఎడ్యుకేషన్ సెంటర్‌లోని హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనసరి అని మన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎంలీ అన్నారు. సోమవారం బోయనపల్లె పోలీసు సబ్‌సెంటర్‌లో వివిధ ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అధికంగా నివసించే బోయనపల్లె ప్రాంతంలో శాంతి భద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీకి ఎదురుగా బస్‌షెల్టర్‌లో ఉన్న మన్నూరు పోలీసు సబ్‌సెంటర్‌ను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. బోయనపల్లె ప్రాంతంపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బోయనపల్లెలో అధికంగా లేడీస్ హాస్టల్స్ ఉన్నాయన్నారు. అందువల్ల విద్యార్థినీల రక్షణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు ముందుగా హాస్టళ్ల నిర్వాహకులు హాస్టల్ వద్ద సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సీఐ సూచించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు శృతిమించితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉద్యమాల రథసారథి యూటీఎఫ్

**రాయచోటి అర్బన్ :** నిరంతర ప్రాతినిధ్యం, పోరాటాలు, ఐక్య ఉద్యమాలు చేస్తుండడం ద్వారా యూటీఎఫ్ ఉద్యమాల రథసారథిగా ముందుకు సాగుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు అన్నారు. సోమవారం స్థానిక అలీమాబాద్‌లోని జెడ్పీ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ – 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం నేతలతో కలసి వారు ఆవిష్కరించారు. మాట్లాడుతూ 1974లో ఏర్పడిన యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేకంగా స్వర్ణోత్సవ డైరీ, క్యాలెండర్‌లను రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావుద్దిన్, నేతలు ప్రసాద్, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, హఫీజుల్లా, శంకర్, నరేంద్ర, శశికిరణ్, రాజు, మదన్‌మోహన్‌రెడ్డి, అనిరుద్దయ్య, బసవయ్య, కిఫాయతుల్లా, రాజబాబు, రఫీక్, ఆదిల్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**సిద్దవటం :** డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు న్యూ ఇయర్ వేడుకల్లో ప్రజలు, యువకులు పోలీసుల నిబంధనలను పాటించాలని లేదంటే చర్యలు తప్పవని ఒంటిమిట్ట సీఐ బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం సీఐ మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి డిసెంబర్ 31న రాత్రి వేళ సిద్దవటం మండలంలోని ప్రధాన కూడళ్లలో మద్యం సేవించకూడదన్నారు. యువకులు అల్లరి చేయడం వంటివి చేయకూడదన్నారు. పోలీసులు స్పెషల్ టీంలు, మొబైల్ టీంలుగా ఏర్పడి హైవేపై వాహనాల తనిఖీ చేపడతామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించబోమని కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. డీజే కార్యక్రమాలకు ఎలాంటి అనుమతిలేదని తెలియజేశారు. కొందరు వ్యక్తులు శుభాకాంక్షలు చెప్పే సమయంలో చైన్ స్నాచింగ్ చేసే అవకాశాలున్నాయని మహిళలు జాగ్రతగా ఉండాలన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడానికి అనుమతులు లేవని సూచించారు.

### పీఆర్‌సీని అమలు చేయాలి



డీఈఓకు డైరీని ఇస్తున్న పీఆర్‌టీయూ నేతలు

**రాయచోటి అర్బన్ :** కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యుడు నాయక్, ఉమామహేశ్వర్‌లు కోరారు. సోమవారం పీఆర్‌టీయూ నూతన డైరీ, టేబుల్ క్యాలెండర్‌ల, జీఓల పుస్తకాలను వారు డీఈఓ సుబ్రమణ్యంల చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ప్రభుత్వం సంక్రాంతి కానుకగా డీఏ బకాయిలు, సరెండర్ లీవు, పీఎఫ్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలంటూ కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేత హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



చిట్వేలి: ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన



పెనగలూరు: ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓలు, అధికారులు

## విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ఆయా మండల కేంద్రాల్లోని జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ఎంఈఓలు, ఉపాధ్యాయులు, అధికారులు పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని ఇలాంటి సృజనాత్మకమైన పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఎగ్జిబిట్స్‌ను రూపొందించిన విద్యార్థులకు అధికారులు బహుమతులు అందజేశారు. కాగా రాజంపేటలో విద్యార్థి ప్రదర్శించిన రోబో ప్రాజెక్ట్ అందరిని ఆకట్టుకుంది.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: రోబో పనిచేసే విధానాన్ని తెలుసుకుంటున్న ఎంఈఓలు



ఓబులవారిపల్లె: సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



లక్కిరెడ్డిపల్లె: సైన్స్ ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ చక్రేనాయక్



సుండుపల్లె: విద్యార్థికి బహుమతిని ఇస్తున్న ఎంఈఓ రవీంద్రనాయక్, ఉపాధ్యాయులు





చిన్నమండెం: బహుమతులు అందుకుంటున్న మల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



పుల్లంపేట: ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి ఇస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు